



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 19 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 195 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సుద్ అహ్మద్

WEDNESDAY AUGUST 19 2026 | VOL:18 | ISSUE: 195 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ.. మేం చేసి చూపించాం: తుమ్మల నాగేశ్వరరావు

రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్న మంత్రి తుమ్మల

గతంలో విడతలవారీగా చెల్లించి రైతులపై రూ.2,630 కోట్ల వడ్డీ భారం మోపారని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విడతలో రూ.20,617 కోట్లు మాఫీ చేసిందని వెల్లడి



(మిగతా 2వ పేజీలో..)

## ఈవీల తయారీలో రాష్ట్రం ముందంజ : భట్టి విక్రమార్క

హైదరాబాద్ : సోలార్ ప్యానెల్, ఈవీల తయారీలో రాష్ట్రం ముందంజలో ఉందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైటెక్స్‌లో జరిగిన ఎనర్జీ సమ్మిట్‌లో పాల్గొన్న భట్టి మాట్లాడుతూ.. విద్యుత్తు సరఫరాలోనూ ఏఐ పరిజ్ఞానాన్ని వాడుకొని, వృథాను అరికట్టాలన్నారు. ఇంధన రంగాన్ని మరింత విస్తరించాల్సి ఉందని, పెరుగుతున్న రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు.



# పేదల ఆరోగ్యం మా బాధ్యత

ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కోసమే రూ.5,226 కోట్లు ఖర్చుచేశాం

వైద్యారోగ్య శాఖకు రూ.21,800 వెచ్చించాం

టెంకాయలు కొట్టి వదిలేసినోళ్లు టిమ్స్ కట్టామని గొప్పలా

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు సమయం పనిచేసే డాక్టర్లకు ప్రోత్సాహకాలివ్వండి

డాక్టర్ మర్రిచెన్నారెడ్డి టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



పేదల వైద్యానికి ప్రాధాన్యమిస్తున్నామనీ, వారి ఆరోగ్యం తమ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్యావైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ లో నూతనంగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిం చారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఆరోగ్యదీపిక పాలిక్లినిక్‌లను ప్రారంభించారు. సురక్షితమైన ఆహారం, నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యంగా టీసేఫ్ వ్యవస్థను ప్రారంభించారు. పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయనీ, ఆ భాషలను నేర్చుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్యం అత్యంత ఖరీదు కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించాలనే లక్ష్యంతోనే సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లను, వరంగల్,

(మిగతా 2వ పేజీలో..)

## పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు.. రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!

ఇప్పటివరకూ ఇదే అత్యధిక కార్పస్

పొదుపు ఖాతాల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లకు నిధుల మళ్లింపు

పెట్టుబడుల వ్యూహం మార్పుతో పెరిగిన రాబడి

కొవిడ్ బాధితుల పిల్లల కోసం కొనసాగుతున్న ఖర్చులు

పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.



(మిగతా 2వ పేజీలో..)

## సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం.. టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

సీఎం విజయ్ కార్యాలయం ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్పు

రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకే ధ్వజం

పాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణ

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన కార్యాలయాన్ని ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్చాలని తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం సిబ్బందికి సౌకర్యవంతమైన



(మిగతా 2వ పేజీలో..)

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం: కవిత

భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత

రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ

రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా

(మిగతా 2వ పేజీలో..)



## కల్తీపై ఉక్కుపాదం.. తెలంగాణలో కొత్తగా 'టీజీ సేఫ్'




టీజీ సేఫ్ తొలి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అవినాష్ మహంతి

ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను కలిపి కొత్త అథారిటీ ఏర్పాటు

ఆహార, ఔషధాల కల్తీని అరికట్టడమే ప్రధాన లక్ష్యం

పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని క్యూర్ ఏరియాలో అమలు

తెలంగాణలో ఆహార, ఔషధాల కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్)' తొలి కమిషనర్‌గా

(మిగతా 2వ పేజీలో..)

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి.. రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: శ్రీధర్ బాబు

నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న శ్రీధర్ బాబు

కాన్ఫరెన్స్ ను నిర్వహించిన నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్

స్మార్ట్ సిటీ పనులను 2028 నాటికి పూర్తి చేస్తామన్న శ్రీధర్ బాబు

తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక



## సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం.. టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

మొదటి పేజీ తరువాయి)

పని వాతావరణం కల్పించేందుకు ఈ మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించగా... కొత్త ఆఫీసు పనుల కోసం కేటాయించిన రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకేలు ధ్వజమెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకుడు కేశవన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొత్త ఆఫీస్ పనులు ఇప్పటికే ప్రారంభమైన నెల తర్వాత, ఎలాంటి ఆన్‌లైన్ విధానం అనుసరించకుండా రూ. 5.5 కోట్ల టెండర్‌ను విడుదల చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి కేవలం 100 రోజులు కూడా కాకముందే పాలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు కేటాయించడంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మరోవైపు, డీఎంకే ఎమ్మెల్యే ఈవీ వేలు స్పందిస్తూ.. సీఎం తన కార్యాలయాన్ని మార్చుకోవడం ఆయన వ్యక్తిగత విషయమని, అయితే ప్రజాధనంతో ముడిపడి ఉన్న టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. అయితే, ఈ అవినీతి ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి కేవలం 100 చదరపు అడుగుల స్థలం కూడా లేదని, వారికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకే ఈ తాత్కాలిక మార్పు చేపట్టామని వివరించారు. ఈ పనులకు సంబంధించి టెండర్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తేల్చిచెప్పారు.

## పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు.. రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!

మొదటి పేజీ తరువాయి)

ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ. 5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ. 479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ. 92.83 లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ. 324.66 కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలో చేరాయి. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఈ ఫండ్ ద్వారా కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు చేయూతనిచ్చే 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' పథకం కింద వ్యయం చేస్తున్నారు.

## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి.. రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం: కవిత

మొదటి పేజీ తరువాయి)

పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

# పేదల ఆరోగ్యం మా బాధ్యత

మొదటి పేజీ తరువాయి)

ఉస్మానియా ఆస్పత్రులను కడుతున్నా మని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు, మొత్తంగా ఆ రెండింటికీ రూ.5,226 కోట్లను ఖర్చుచేశామని వివరించారు. రెండేండ్లలో వైద్యారోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు వెచ్చించామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాలను కట్టించాలనే సోయి గత ప్రభుత్వానికి ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు. టిమ్స్ ఆస్పత్రులకు, వరంగల్ దవాఖానాకు కేవలం టెంకాయలుకొట్టి వదిలేశారనీ, పదేండ్లలో వాటిని ఎందుకు కట్టలేదని అడిగారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లను, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రులను 2027 డిసెంబర్ తొమ్మిదో తేదీకల్లా పూర్తిచేసి ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి స్పెషాల్టీ వైద్యసేవలను అందజేస్తామనీ, వాటిని నిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. అవన్నీ పూర్తయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరో పదివేల బెడ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆస్పత్రికొచ్చే రోగుల సహాయకులు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డాక్టర్ ఎమ్‌సీఆర్ టిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ పీజీ విద్య, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అదనంగా సమయం వెచ్చించి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే, సర్జరీలు చేసే వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను వేదిక నుంచే ఆదేశించారు. తాము సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామని ప్రకటించగానే కొందరు పగటివేషగాళ్లలా తిరిగి పోయారనీ, ఇది తామే కట్టామని కేటీఆర్ చెప్పి పోయారని విమర్శించారు. వెనక ఉన్న ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లి మానసిక రోగిని టిమ్స్ కట్టిన తమను గుర్తుపట్టట్లేదా? అని కేటీఆర్ అడిగితే..."ఈడికొచ్చినప్పుడు చార్మినార్ నేనే గట్టిన. హైదరాబాద్‌ను నేనే నిర్మించిన అనుకునేటోన్ని. ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేటోన్ని. ఈడ డాక్టర్లు మంచిగ చూస్తరు. రానురాను పిచ్చి తగ్గిపోతది లే అన్నడంట" అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు సమయం ఉందిగానీ ప్రభుత్వ ఆస్పత్రులను కట్టించి ప్రారంభించేందుకు పదేండ్లలో సమయమే దొరలేదా? అని ప్రశ్నించారు. అబద్ధాలు మానుకుని ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, నియోజకవర్గానికి పది నుంచి 20 కోట్ల రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవచేస్తే చేసిన పాపాలు కొంతైనా తగ్గుతాయని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదనీ, ఇలా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం ప్రజలకు నిజాలు చెబుతూనే ఉంటానన్నారు.

**బీఆర్ఎస్ నేతల ప్రచారం పచ్చి అబద్ధం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ...తాము కట్టిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభిస్తోందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని విమర్శించారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చుచేసింది రూ.70 కోట్లు మాత్రమేననీ, ఆ డబ్బులతో అది ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం కోసం తమ ప్రభుత్వం రెండున్నరేండ్లలో రూ.9 వేల దాకా ఖర్చుపెట్టిందనీ, ఆరు ప్రధాన ఆస్పత్రుల నిర్మాణాలపైనే రూ.3,800 ఖర్చుచేశామని గణాంకాలతో సహా వివరించారు. ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలను రూ.10 లక్షల సహాయాన్ని అందిస్తున్నామనీ, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ పథకం కిందనే రూ.100 కోట్లు విడుదల చేస్తున్నామని చెప్పారు.

**90 శాతం వైద్యసేవలు జిల్లాల్లోనే అందేలా కృషి : మంత్రి దామోదర్ రాజనర్సింహ**

90 శాతం వైద్యసేవలు జిల్లాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లోనే అందేలా కృషి చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్‌లో గుండె సంబంధ, అవయమార్పిడి, కిడ్నీ...ఎల్‌బీనగర్ టిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పీడీయాట్రిక్...అల్వాల్ టిమ్స్‌లో న్యూరాలజీ, జెనిటిక్‌కు సంబంధించిన స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తామని మరోమారు చెప్పారు. టిమ్స్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునికమైన రేడియాలజీ విభాగం గురించి వివరించారు. రాబోయే పదేండ్లలో తలసేమియా రహిత తెలంగాణగా మార్చే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. మహిళా సంక్షేమం, వైద్యం, విద్య, సంక్షేమం ప్రభుత్వానికి నాలుగు పిల్లర్ల లాంటివనీ, వాటిపైనే దృష్టి పెట్టి తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. ప్రతి టిమ్స్‌లో విదేశీ రోగులకు చికిత్సలు అందించేందుకు వంద పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**రోగుల సేవల్లో 70 శాతం నర్సులదే : మంత్రి పొన్నం**

తెలంగాణ కోసం కొట్లాడిన మర్రి చెన్నారెడ్డి పేరుమీద టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డాక్టర్లు దేవుళ్లతో సమానమనీ, నర్సులు దైవదూతలని కొనియాడారు. రోగులకు వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమనీ, డాక్టర్లు 30 శాతం సేవ చేస్తే 70 శాతం సేవ నర్సులదేనని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టియానా చోంగ్తూ, కమిషనర్ సంగీతా సత్యనారాయణ, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ.. మేం చేసి చూపించాం: తుమ్మల నాగేశ్వరరావు

కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ ప్రక్రియ అత్యంత పేలవంగా సాగిందని ఆయన ఆరోపించారు. రైతు రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఆయన గణాంకాలతో సహా వివరించారు. 2014లో మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చినప్పటికీ, లక్ష రూపాయల రుణమాఫీని బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకేసారి అమలు చేయలేకపోయిందని గుర్తుచేశారు. నాలుగేళ్ల పాటు విడతల వారీగా నిధులు విడుదల చేయడంతో రైతులపై అదనంగా రూ. 2,630 కోట్ల వడ్డీ భారం పడిందని తెలిపారు. ఇక 2018లో మళ్లీ లక్ష రూపాయల రుణమాఫీ హామీ ఇచ్చి, కేవలం సగం మంది రైతులకే వర్తింపజేసి, మిగిలిన రూ. 8,379 కోట్ల బకాయిలను పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. పదేళ్ల పాటు రైతులను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు వారిపై కపట ప్రేమ చూపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి పంట కాలంలోనే ఏకకాలంలో రూ. 20,617 కోట్ల రుణాలను మాఫీ చేసిందని తుమ్మల వెల్లడించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 25,35,964 మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలను అత్యంత పారదర్శకంగా మాఫీ చేయడం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని వివరించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకే పంట రుణ బకాయిలు అత్యంత తక్కువగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివేదిక ధ్రువీకరించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

## కల్తీపై ఉక్కుపాదం.. తెలంగాణలో కొత్తగా 'టీజీ సేఫ్'

మొదటి పేజీ తరువాయి)

సీనియర్ ఐపీఎస్ అధికారి అవినాష్ మహంతి బాధ్యతలు స్వీకరించారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు, ఆహార పదార్థాలు, నిత్యావసర ఔషధాల నాణ్యత, భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయడమే లక్ష్యంగా ఈ నూతన వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో ఫుడ్ లైసెన్సులు పొందిన వ్యాపార సంస్థలు, ఫార్మా కంపెనీల సంఖ్య గణనీయంగా పెరగడంతో పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే, ఇప్పటివరకు వేర్వేరుగా కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి 'టీజీ సేఫ్'ను రూపొందించారు. నాణ్యత లేని, కల్తీ ఆహార ఉత్పత్తులతో పాటు నకిలీ ఔషధాల తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవడం ఈ నూతన అథారిటీ ప్రధాన ఉద్దేశ్యం. ఈ రెండు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచి, తనిఖీలను ముమ్మరం చేయడం ద్వారా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా, ఫుడ్, ఫార్మా వ్యాపారాలు అధికంగా కేంద్రీకృతమై ఉన్న హైదరాబాద్‌లోని క్యూర్ ఏరియాలో ఈ ఏకీకృత వ్యవస్థను అమలు చేయనున్నారు.

విజయకేరటం
తెలుగు దినపత్రిక
ఆగస్టు | బుధవారం | 19 | 2026


# నల్లగొండ పట్టణాన్ని సుందరమనముగా తీర్చి దిద్దడమే లక్ష్యం

**నల్లగొండ ఆగస్టు 18 విజయ కెరటం ప్రతినిధి,**

నల్గొండ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. ముందుగా మంత్రి 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వన్ టైం ఇంప్రూవ్మెంట్ కింద 14.45 కోట్ల రూపాయల తో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా డివిజన్ లలో మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో చేపట్టిన సిసి రహదారులు, డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, మారుమూల శివారు ప్రాంతాలను కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల ఏర్పాటుతోపాటు, సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ,విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలని కల్పిస్తున్నామని, పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయగా, నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయని, పట్టణానికి తాగినీటి కై ముఖ్యమంత్రిని ఒప్పించి మరో 300 కోట్ల రూపాయలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇదివరకే పట్టణంలో 125 కోట్ల రూపాయలతో 12 తాగునీటి ట్యాంకులు చేపట్టగా, అందులో ఒకటి పూర్తి అయిందని, డిసెంబర్ నాటికి తక్కిన 11 వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితాయని వెల్లడించారు. పట్టణంలో విద్యుత్ సమస్య లేకుండా ప్రధాన కాలనీలతో పాటు, శివారు గ్రామాలలో కూడా ఒక్కొక్కటి 3 కోట్ల రూపాయలు వెచ్చించి సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమున్న చోట స్మశాన వాటికలు, దేవాలయాలు,చర్చిలు మసీదులను కట్టిస్తున్నామని, పట్టణానికి మొదటి విడత 700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అవసరమైతే మరిన్ని ఇండ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ నెల 15న గొల్లగూడ సమీపంలో నిర్మించిన 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించామని, నల్గొండ ను సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. పట్టణంలో లతీఫ్ సాబ్ గుట్ట, శివాలయం గుట్టలకు 150 కోట్ల రూపాయలతో రహదారులను మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని, అంతేకాక రోప్ వే కూడా ఏర్పాటు చేస్తున్నామని, పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన ఛాయా సోమేశ్వర దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 150 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామని, పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సమస్యలు తీరుస్తామని, పట్టణానికి నడిబొడ్డున ఉన్న నాగార్జున కళాశాల బ్లాక్ ను



అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, తెలంగాణలోనే మొదటి కళాశాల గా పేరుపొందిన ఎన్జీ కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు, మహిళా స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి చేసేందుకు ఇటీవలే 3 కోట్ల రూపాయలతో పెట్రోల్ పంపును ప్రారంభించామని, 2 కోట్ల రూపాయలతో సూపర్ మార్కెట్ నిర్మిస్తున్నామని,



అంతేకాక మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గోదాముల నిర్వహణ, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి చేయిస్తున్నామని, సంఘంలో లేని మహిళలు కొత్త సంఘాలుగా ఏర్పాటు కావాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయా లకతీతంగా నల్గొం డ కార్పొరేషన్ ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని, పట్టణంలో రహదారుల ఏర్పాటుతో పాటు, డివైడర్లు ,సెంట్రల్ లైటింగ్, హైమాస్ లైటింగ్, సుందరీకరణ వల్ల పట్టణానికి మరింత శోభను తీసుకొస్తుందని అన్నారు. కార్పొరేటర్లు మల్లీశ్వరి, బొడ్డుపల్లి లక్ష్మి ,కవిత, వేణు, తదితరులు మాట్లాడారు. డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, డిటిడిఓ, ఏసీఎస్ డైరెక్టర్ నాగరత్నం, కార్పొరేటర్లు స్వాతి, కవిత, జాతీయ రహదారి అధికారులు, తదితరులు ఉన్నారు

# నల్గొండ అభివృద్ధికి రూ.500 కోట్లతో రహదారుల పనులు





## రూ.9.40 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన

**నల్లగొండ ఆగస్టు 18 విజయ కెరటం ప్రతినిధి,**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 3 వ డివిజన్ పరిధిలోని ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా అద్దంకి రోడ్డు వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను నంబర్ వన్ గా చేయాలన్నదే తన ధ్యేయ మన్న మంత్రి. నల్గొండ శివారు గ్రామాలన్నింటిని కలుపుకొని నల్గొండ కార్పొరేషన్ ను అభివృద్ధి చేస్తాం .నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 500 కోట్ల రూపాయలతో రహదారులు ,సిసి రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. పనులు నడుస్తున్నాయి. నల్గొండ పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేందుకు ఇటీవల 83 కోట్ల రూపాయలతో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన వాటర్ ప్లాంట్ ద్వారా నెల రోజుల్లో తాగునీరు అందించనున్నాము. లెప్రసీ కాలనీలో 3 కోట్ల రూపాయలతో సబ్ స్టేషన్ మంజూరు చేసాం. పనులు పురోగతిలో ఉన్నాయి. స్మశాన వాటిక పనులు కొనసాగుతున్నాయి . శేషమ్మ గూడెంలో గుడి కట్టించడంతోపాటు, సిసి రోడ్లు, వాటర్ ట్యాంక్ నిర్మించాము. ఇండ్లు లేని నిరుపేదలకు 50 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసాము. అవసరమైతే మరో 50 ఇండ్లు ఇయ్యడానికి సిద్ధంగా ఉన్నాము. శేషమ్మ గూడెం ప్రజలకు ప్రభుత్వం రేషన్ కార్డులు, మంజూరు చేసింది. సన్న బియ్యం ఇస్తున్నాం. ప్రజలు అడగకున్న అభివృద్ధి పనులు చేపడుతాము. వారం రోజుల్లో హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులు ప్రారంభమవుతాయి. ఏ 15 కోట్ల రూపాయల వ్యయంతో నల్గొండ పట్టణంలోని పాన్గల్ సావర్కర్ రహదారి నుండి భాస్కర్ థియేటర్ వరకు రోడ్డు పనులు ఈరోజే ప్రారంభిస్తున్నాం. హాజరైన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మూడవ డివిజన్ కార్పొరేటర్ మల్లేశ్వరి, అధికారులు, ప్రజాప్రతినిధులు.

# మల్లె పెల్లి స్కూల్ ప్రిన్సిపాల్ హత్య సంఘటన సుమోటాగా స్వీకరించిన మహిళా కమిషన్

**నల్లగొండ ఆగస్టు 18 విజయకేరటం ప్రతినిధి**



"నల్గొండ జిల్లా నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ దారుణ హత్య ఘటనను సుమోటోగా తీసుకున్న మహిళా కమిషన్ -- నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి నివేదిక సమర్పించాలని ఎస్పీకి ఆదేశం" నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం, జేబీ కాలనీలోని తన నివాసంలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్ శ్రీమతి కుల్లు రూపా రెడ్డి దారుణ హత్యకు గురైన ఘటనను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ గౌరవ చైర్‌పర్సన్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నప్పటికీ నిందితులను ఇంకా గుర్తించక పోవడం పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీడియా కథనాలు, ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించింది. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు.. ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని నల్గొండ జిల్లా ఎస్పీకి కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. మహిళలపై జరిగే ఇటువంటి తీవ్రమైన హింసాత్మక ఘటనలను అత్యంత ప్రాధాన్యతతో విచారించి, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చైర్‌పర్సన్ అన్నారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని గౌరవ చైర్ పర్సన్ శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి గారు స్పష్టం చేశారు.

# పీఎం శ్రీ పాఠశాల నుండి వచ్చే విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి కలెక్టర్



**నల్లగొండ ఆగస్టు 18 విజయకేరటం ప్రతినిధి**



పీఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చే విద్యార్థులను అన్ని రంగాలలో సామర్థ్యం కలిగి ఉండేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం శ్రీ పాఠశాలలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులను అన్ని అంశాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు వారిలో ఉన్న సృజనాత్మకతను బయటికి తీయాలని, పిఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్లను ఆదేశించారు. చదువుతోపాటు,విద్యార్థి అన్ని అంశాలలో మూర్తిమత్వం అభివృద్ధి చెందేలా పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులను తయారు చేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, వివిధ అంశాలలో ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా విశ్లేషించి వారి అభివృద్ధికి, మెరుగైన విద్యను అందించే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని చదువుతోపాటు, ఇతర అంశాలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పి ఎం శ్రీ పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి మూల్యాంకన పద్ధతులను మార్చాలని ,వారి ఆంగ్ల భాష నైపుణ్యభివృద్ధికి స్పెల్ బి పోటీ లను ఏర్పాటు చేయాలని, బాలికలలోనాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సమాజంలో రోల్ మోడల్స్ గా ఉన్న మహిళల, ద్వారా చైతన్యం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం శ్రీ పాఠశాలల్లో రొటీన్ కు భిన్నంగా చదువు ఉండాలని, చదువుతోపాటు, అన్ని అంశాలలో అభివృద్ధి కనిపించాలని, ప్రత్యేకించి బాలికలు పురుషులతో పాటు సమానంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని, బాలికలకు ఇచ్చే స్వీయ రక్షణ అంశంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని చెప్పారు. వచ్చే బాలల దినోత్సవం నాటికి 8, 9, 10 తరగతి విద్యార్థులకు టైపింగ్ లో ప్రావీణ్యం పొందేలా శిక్షణ ఇచ్చి ఉత్తమ విద్యార్థులను సన్మానించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులలో అవగాహన కోసం క్షేత్రస్థాయి పర్యటనకు ముందు నుండే ప్రణాళిక రూపొందించాలని, నామమాత్రపు క్షేత్రస్థాయి సందర్శన కాకుండా, ప్రతిరోజు మనతో ముడిపడి ఉండే అంశాలైన వ్యవసాయం, ఉద్యానం, విద్యుత్తు ఉత్పత్తి, సేవా రంగాలు, బ్యాంకులు, ఇతర సంస్థల పనితీరు, పరిపాలన తదితర అంశాలను వారు స్వయంగా చూసి నేర్చుకునే విధంగా ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. పిఎం శ్రీ పాఠశాలల వాతావరణాన్ని పూర్తిగా మార్చాలని, ఉపాధ్యాయులు సైతం వారికి మెరుగైన విద్యతోపాటు, వివిధ అంశాలలో భిన్నమైన విధంగా జ్ఞానాన్ని అందించేందుకు చూడాలని చెప్పారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఇఓ సుసింధర్ రావు, ఎంఈఓ లు, పిఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

# అంకిరెడ్డిగూడెంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం

**చౌటుప్పల్ ఆగస్టు 18 విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్**



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పరిధిలో అంకిరెడ్డిగూడెం గ్రామంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి. నర్సిరెడ్డి గ్రామ ప్రజలు, యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ముఖ్యంగా యువత చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, విద్య, ఉద్యోగం, క్రీడలు వంటి మంచి మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులు సూచించారు.

# సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం



**చౌటుప్పల్ ఆగస్టు 18 విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో లింగోజిగూడెం ఎక్స్ రోడ్డు వద్ద సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. మన్మధ కుమార్ మరియు ఎస్సై యాదగిరి వారి సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, ఓటిపి లు మరియు బ్యాంక్ ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

# రవితేజ 'ఇరుముడి'లో 'మల్లెపూల పల్లకి' పాటపై విమర్శలు.. దర్శకుడు శివ నిర్వాణ వివరణ

మాస్ మహారాజా రవితేజ కథానాయ కుడిగా నటిస్తు న్న 'ఇరుముడి' చిత్రం నుంచి విడుదలైన 'మల్లెపూల పల్లకి' పాటపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై దర్శకుడు శివ నిర్వాణ స్పందించారు. గాయకు డి వాయిస్ బేస్ పాటను దెబ్బతీసిందంటూ జరు గుతున్న చర్చకు ఆయన వివరణ ఇచ్చారు. ఒరిజినల్ సింగర్‌కు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ విషయంపై మాట్లాడుతూ... ఒరిజినల్ పాట విడుదలై 15 ఏళ్లకు పైగా అయిందని, వయసు రీత్యా గాయకుడి గాత్రంలో మార్పు రావడం సహజమని శివ నిర్వాణ అన్నారు. సింగర్ వాయిస్ బేస్ సరితూగదనే విషయం తమకు ముందే తెలుసని, అయినా ఆ పాటకు ప్రాణం పోసిన ఒరిజినల్ గాయకుడు డప్పు శ్రీనుతోనే మళ్లీ పాడించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఆయనకు గౌరవం ఇవ్వడం కోసమే ఈ పని చేశామని స్పష్టతనిచ్చారు. మాస్ మహారాజా రవితేజ, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న 'ఇరుముడి' సినిమా నుంచి ఆదివారం ఈ పాట విడుదలైంది. విడుదలైన వెంటనే ఈ పాట సంగీత ప్రియులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచింది. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరచిన ఈ పాటకు చౌడం శ్రీనివాసరావు సాహిత్యం అందించారు. ప్రేమకథా చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన శివ నిర్వాణ, మాస్ ఇమేజ్ ఉన్న రవితేజతో సినిమా చేస్తుండటంతో 'ఇరుముడి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్ర పోషిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పణలో టీ-సిరీస్ ఫిల్మ్స్‌తో పాటు ఏకేడీ స్టూడియోస్, యూవీ సంస్థలు కూడా నిర్మాణంలో పాలుపంచుకుంటున్నాయి. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాను ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# పంచాయతీరాజ్ ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం





**నల్లగొండ ఆగస్టు 18 విజయ్ కెరటం ప్రతినిధి**

జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి: ప్రేమ్ కరణ్ రెడ్డి పంచాయతీ రాజ్ ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా ప్రజా పరిషత్ కార్య నిర్వహణ అధికారి ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. 80 స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు తీసుకున్న జజూా ప్రేమ్ కరణ్ రెడ్డి గారితో పాటు పంచాయతీరాజ్ శాఖలో ఉత్తమ అధికారులుగా అవార్డు పొందిన ఉద్యోగులకు పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ సంఘం జిల్లా శాఖ తరపున జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జజూా ప్రేమ్ కరెంట్ రెడ్డి గారిని పంచాయతీరాజ్ ఉద్యోగులు శాలువా లు బొకేలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉద్యోగులు బాధ్యతతో పనిచేసినప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతాయి అన్నారు. ప్రభుత్వ శాఖలలో పంచాయతీరాజ్ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేసేది పంచాయతీరాజ్ ఉద్యోగులే అని అన్నారు. పంచాయతీ రాజ్ లోని అన్ని సంఘాల ఐక్యతతోనే వేగవంతంగా ప్రమోషన్లను ప్రక్రియ పూర్తి చేసుకోవడం జరిగిందని జిల్లాలో అన్ని మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులను నియమించుకోవడం జరిగిందన్నారు. తద్వారానే పంచాయతీరాజ్ ఉద్యోగులకు కిందిస్థాయి నుంచి ప్రమోషన్ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. అవార్డు పొందిన అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని ప్రతి ఉద్యోగి అవార్డు పొందే విధంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అవార్డు పొంది అవార్డు పొందిన ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్ నాయక్ గారితో పాటు జిల్లా పరిషత్ సూపర్డెంట్ సురేందర్ రెడ్డి జిల్లా పరిషత్ టైపిస్ట్ అముతుల్ ఫాతిమా తో పాటు అవార్డు పొందిన అధికారులకు శాలువా బొకేలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపముఖ్యనిర్వహణ అధికారి అలివేలు మంగమ్మ నల్గొండ జిల్లా పంచాయతీ రాజ్ అసోసియేషన్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేశ్ జిల్లా పరిషత్ సూపర్డెంట్లు శ్రీనివాస్ చారి ఉద్యోగులు హరినాథ్ శ్రీను, ప్రవీణ్ విజయ్ శోభ విజయ భాస్కర్ రెడ్డి రజిత స్నేహ ప్రకాష్ ఎండి గులాం రబ్బాని రేణుక రేఖ భాగ్యలత తదితరులు పాల్గొన్నారు

# స్నేహితుడు లేకున్నా మేమున్నామంటూ భరోసా

- **తోటి మిత్రుడి కుమార్తె వివాహానికి రూ.80 వేల ఆర్థిక సాయం**

**చౌటుప్పల్ ఆగస్టు 18 విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్**




మానవత్వానికి, స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా పంతంగి గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ పాఠశాల 1997--98 పదవ తరగతి బ్యాచ్ క్లాస్‌మేట్స్ నిలిచారు. తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితుడు బరక యాదయ్య కొన్ని సంవత్సరాల క్రితం అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచిన మిత్రులు మరోసారి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. బరక యాదయ్యకు ఒక కుమార్తె ఉంది. ఆమె వివాహం (19-08-2026) జరగనున్న నేపథ్యంలో, యాదయ్య తమ మధ్య లేకపోయినా ఆయన కుటుంబానికి తామున్నామనే భరోసా కల్పించాలని 1997--98 పదవ తరగతి బ్యాచ్ క్లాస్‌మేట్స్ నిర్ణయించారు. ఈ మేరకు మిత్రులంతా కలిసి సుమారు రూ.80,000 విలువైన ఫర్నిచర్‌ను వివాహం సందర్భంగా అందజేయడంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించారు. స్నేహితుడి కుటుంబానికి అవసరమైన సమయంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావించిన క్లాస్‌మేట్స్, యాదయ్య తమ మధ్య లేకపోయినా ఆయన కుటుంబంతో తమ అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. కుమార్తె వివాహాన్ని సంతోషంగా నిర్వహించుకునేందుకు తమ వంతు సహాయం అందించడం ద్వారా తోటి మిత్రుడి కుటుంబానికి మానసికంగా, ఆర్థికంగా ధైర్యాన్ని కల్పించారు. సంవత్సరాలు గడిచినా పాఠశాల రోజుల స్నేహాన్ని మరచిపోకుండా, తోటి మిత్రుడి కుటుంబానికి అవసరమైన సమయంలో అందరూ ఒక్కటై సహాయం చేయడం పలువురి ప్రశంసలు అందుకుంది. స్నేహం అంటే కేవలం కలిసి చదువుకోవడం, కలుసుకోవడం మాత్రమే కాదని.. కష్టసమయంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని ఈ సందర్భంగా క్లాస్‌మేట్స్ చాటిచెప్పారు. "మా స్నేహితుడు యాదయ్య మా మధ్య లేకపోయినా.. ఆయన కుటుంబానికి మేమున్నామనే భరోసా ఎప్పటికీ ఉంటుంది. ఆయన కుమార్తె వివాహం సంతోషంగా జరగాలని కోరుకుంటున్నాం" అని 1997--98 బ్యాచ్ క్లాస్‌మేట్స్ పేర్కొన్నారు. తోటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి, కుమార్తె వివాహానికి సుమారు రూ.80 వేల విలువైన ఫర్నిచర్‌తో పాటు ఆర్థిక సహాయం అందించిన జడ్పీహెచ్ఎస్ 1997--98 పదవ తరగతి బ్యాచ్ క్లాస్‌మేట్స్‌ను పలువురు అభినందించారు. వారి సేవాభావం, స్నేహబంధం, మానవత్వం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528